జిల్లాలో ఇంటింటికి కుళాయి

పనులను సకాలంలో పూర్తి చేయాలి
కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన ఇంటింటికి కుళాయి కనెక్షన్ పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఆర్డబ్ల్యూఎస్, జిల్లా పరిషత్తు, సమగ్ర శిక్షా, డ్వామా, డీఆర్డీఏ శాఖల అధికారులతో కలిసి జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనులు, జగనన్న కాలనీలో తాగునీరు పైపులైన్ల పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ అందివ్వాలనే కేంద్ర, ప్రభుత్వ లక్ష్యం నెరవేరే విధంగా జిల్లాలో చేపట్టిన పైపులైను సకాలంలో పూర్తి చేయాలన్నారు. జేజేఎం, జగనన్న కాలనీలో పైపులైన్ల పనులు నిమిత్తం టెండర్ ద్వారా చేపట్టని 51 పనులను కమ్యూనిటీ కాంట్రాక్టు వ్యవస్థ ద్వారా గ్రామ జల సంఘాల కమిటీలు ఏర్పాటు చేసి పైపులైన్లు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. 11 మంది సభ్యులున్న ఈ కమిటీ చేపట్టాల్సిన పనులపై జిల్లా స్థాయి కమిటీ ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. గ్రామ, మండల స్థాయిలో కమిటీలకు శిక్షణా కార్యక్రమాలు జరుగుతున్నాయని ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిచేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు. కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం. శ్రీనివాసు, జెడ్పీ సీఈవో ఎ శ్రీరామ చంద్రమూర్తి, డీఆర్డీఏ పీడీ కె శ్రీరమణి, డ్వామా పీడీ ఎ వెంకటలక్ష్మి, ఎస్ఎస్ఏ ఎస్ఈ వెంకట రాజు, జెడ్పీ ఏవో ఎం బుజ్జి బాబు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సమ్మెకు సిద్ధంకండి

విశాలాంధ్ర - సామర్లకోట : కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని రైతు, కార్మిక ప్రజా అనుకూల విధానాలకై పోరాడాలని సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పిలుపునిచ్చాయి. ఈ పిలుపును కాకినాడ జిల్లాలో పూర్తిస్థాయిలో అమలుపరిచేందుకు ఎఐటీయుసి, బికెఎంయు, ఎఐకెఎస్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకులు జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్ల సత్యనారాయణ అధ్యక్షతన జరిగే గ్రామీణ బంద్ పారిశ్రామిక సమ్మె వాల్ పోస్టర్ను సామర్లకోటలో గురువారం స్థానిక విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాలు వద్ద ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ హాజరయ్యారు. ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 16వ తేదీన దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్ నిర్వహించాలని, పారిశ్రమలన్నింటిలో కార్మిక సమ్మె జరపాలని సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్ణయించినట్టు తెలిపారు. కామిరెడ్డి బోడకొండ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి మరింత ద్రోహం చేసిందన్నారు. ప్రత్యేక హెూదాను నిరాక రించిందని, వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇవ్వాల్సిన ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయడం లేదని తెలిపారు. రాష్ట్రాల హక్కులను కాపాడుకునేందుకే ఫిబ్రవరి 16న బంద్ జరుగుతుందని, ఈ బందుకు ప్రజలందరూ మద్దతు పలకాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వెలిశెట్టి రామదాసు, మడగల రమణ, సప్ప సూరిబాబు, పెద్దిరెడ్ల అర్జున, అడపా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

భీమారావుకు ఉగాది పురస్కారం

విశాలాంధ్ర - కొత్తపేట : కొత్తపేటకు చెందిన ప్రముఖ కవి జినిపే భీమారావు(చిన్నీ)కు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో సాహితీ సేవా సంస్థ ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ద్వా.నా. శాస్త్రి సాహితీ పీఠం ఉగాది సాహితి పురస్కారాన్ని గురువారం ప్రకటించింది. సాహితీ పీఠం అధ్యక్షులు, ఉభయ తెలుగు రాష్ట్రాల తెలుగు అధ్యాపకుల సంఘం గౌరవ ఉపాధ్యక్షులు నల్లా నరసింహమూర్తి, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ శ్రీపాద రామకృష్ణ జినిపె భీమారావుకు ఉగాది పురస్కారాలను ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఉగాది రోజున అమలాపురంలో జరిగే ప్రత్యేక సమావేశంలో భీమారావుకు ఈ పురస్కారం అందజేయనున్నట్లు వారు తెలిపారు. వేలాదికవితలు రచించి ఆధునిక తెలుగు సాహిత్యంలో గుర్తింపు పొందారని మనసు పరిమళాలు, సిసింద్రీలు పుస్తకాన్ని రచించి అందరి హృదయాలను ఆకట్టుకున్నారని వారు తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త నల్లా నరసింహమూర్తి సృష్టించిన గాలిపటాలు ప్రక్రియలో ఎన్నో కవితలు రాశారని వారు తెలిపారు. ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ జాక్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వంటి ఎన్నో అవార్డు పొందారని, శ్రీ శ్రీ కళావేదిక జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ నుండి ఎన్నో సన్మానాలు ప్రశంసా పత్రాలు పొందాలని, ఈ పురస్కారం ఇవ్వడం ద్వారా భీమారావు ప్రతిభను గుర్తించినట్లు అవుతుందని వారు తెలిపారు.

వైసీపీ గెలుపునకు కృషి చేయాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరోసారి గెలిపించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ కోరారు. నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేటకు గురువారం చేరుకుని పార్టీ శ్రేణులను కలిశారు. జగ్గంపేట విచ్చేసిన ఆయనకు కాకినాడ జిల్లా జెసియస్ కో ఆర్డినేటర్ ఒమ్మి రఘురామ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చి, పూలమాలలతో స్వాగతం పలికారు. తదుపరి జగ్గంపేటలోని వైఎస్సార్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు పార్టీ నాయకులను సునీల్‌కు రఘురామ్ పరిచయం చేసారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ ఈ ఎన్నికలలో ప్రజలందరూ మరొకసారి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చేలా ప్రయత్నం చేయాలన్నారు. కాకినాడ పార్లమెంట్ నుండి తనను గెలిపించి నియోజకవర్గ ప్రజలకు సేవచేసుకొనే భాగ్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాడు సొసైటి ఛైర్మన్ పాము సూరిబాబు, పార్టీ నాయకులు ముత్యాల శ్రీనివాసు, పెద్దాడ రాజబాబు గొల్లపల్లి శ్రీను, ఆకుల శ్రీధర్, చెరుకూరి జయరాజు, మండల సేవాదళ్ కన్వీనర్ కీలపర్తి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సదస్సు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో హెల్త్ హార్వెస్ట్ పేరుతో ఆరోగ్యకర జీవనానికి ఆహారపు అలవాట్లు అనే అంశంపై విద్యార్థులకు ఒక రోజు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూర్య గ్లోబల్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ ఎన్ రఘు వంశీ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు, ఆరోగ్యమే మహాభాగ్యం అనే విషయాన్ని మన పూర్వీకులు మనకు చెప్పిన విషయం అయినప్పటికీ నేడు ప్రజలు రకరకాల జంక్ ఫుడ్‌లను తీసుకుంటూ చేజేతులా ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారు. వేళకాని వేళలో ఆహారం తీసుకోవడం సరైన నిద్ర లేకపోవడం వల్ల అనారోగ్య సమస్యలు ఊబకాయంతో బాధ పడటం జరుగుతుంది అని డాక్టర్ రఘు వంశీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి డాక్టర్ బి. రామ్మోహన్ రెడ్డి, ప్రో అయన్, యూత్ రెడ్ క్రాస్ యూనిట్ కో ఆర్డినేటర్ పి.శివ కుమార్, బి.రామ్ సాగర్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకటో తరగతిలో ప్రవేశాలకు విద్యాశాఖ ఉత్తర్వులు

విశాలాంధ్ర - గండేపల్లి : ఒకటో తరగతి విద్యార్థుల ప్రవేశాలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎంఈఓ నాయక్ తెలిపారు. ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం, సెక్షన్ 12 (1) (సి) ఆర్‌టిఇ 2009 ప్రకారం 2024-25 విద్యా సంవత్సరానికి జిల్లాలో ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలో 25% సీట్లు పేద విద్యార్థులకు, అనాధ పిల్లలకు, హెచ్ఐవి బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, ఓసి వర్గాల పిల్లలకు వారి నివాస సమీప ప్రాంతంలో ఐబి/సిబిఎస్‌సి/ఐసిఎస్ఇ/స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలో ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు జిల్లా విద్యాశాఖాధికారి, పాఠశాల విద్యాశాఖ-సమగ్ర శిక్షా, కాకినాడ జిల్లా వారు ఉత్తర్వులు ఇచ్చి ఉన్నారు. కావున, షెడ్యూల్ ప్రకారం విద్యార్థులు దరఖాస్తు చేసుకొనుట కొరకు ఆధార్ ద్వారా ప్రాథమిక వివరాలతో http://cse.ap.gov.in వెబ్ సైట్ నందు రిజిస్టర్ చేసుకోవాలి లేదా విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత గ్రామ సచివాలయం, మండల విద్యా వనరుల కేంద్రం, సంబంధిత పాఠశాల నుండి దరఖాస్తు చేసుకోవాలి. 23.02.2024 నుండి 14.03.2024 వరకు 25% కోటా క్రింద ప్రవేశం పొందడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాశాఖ పేర్కొంది.

ఆనందోత్సాహాలతో హజరత్ అబ్బాస్ జయంతోత్సవం

విశాలాంధ్ర - మామిడికుదురు : షియా మతస్థుల ఆరాధ్య దైవం హజరత్ అబ్బాస్ జయంతోత్సవాలను నగరం, మామిడికుదురు, మొగలికుదురు గ్రామాల్లో ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. కర్బలా అమరజీవి హజరత్ ఇమామ్ హుస్సేన్ సేనాధిపతిగా ఇస్లాం చరిత్రలో హజరత్ అబ్బాస్‌కు ప్రత్యేక స్థానం ఉంది. వీరాధివీరుడు పరాక్రమశాలిగా హజరత్ అబ్బాస్‌ను ముస్లింలు కొలుస్తారు. మామిడి కుదురులోని హజరత్ అబ్బాస్ పంజా నందు నగరంలోని మంజిలే కర్బలా యందు మీలాద్ ఏర్పాటయ్యాయి. పలువురు ఉర్దూ కవులు తమ కవిత్వాల ద్వారా హజరత్ అబ్బాస్ వీరత్వాన్ని కొనియాడారు.

రాజు కుటుంబానికి సీపీఐ, ప్రజాసంఘాల పరామర్శ

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట తాపీ పనివారల సంఘం అధ్యక్షులు దూదిం పూడి రాజు ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం సామర్లకోట లోని నీలమ్మ చెరువు దగ్గరలోని ఆయన కుటుంబాన్ని ఏపీ బిల్డింగ్ & కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఎఐటియుసి జిల్లాకార్యవర్గ సభ్యులు పెద్ది రెడ్ల సత్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ పరామర్శించారు. ముందుగా దూదింపుడి రాజు చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. తోకల ప్రసాద్ మాట్లాడుతూ రెక్కాడితేనే కానీ డొక్క నిండని భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల బ్రతుకులకు భరోసా కరువైందన్నారు. కుటుంబ యజమాని మరణిస్తే ఆ కుటుంబానికి ఆదరణ కరువవుతున్నదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సాధారణ మరణం సంభవిస్తే ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం సంక్షేమ బోర్డు ద్వారా అందేదని, ఈ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు ఒక్క రూపాయి కూడా అందడం లేదని ప్రసాద్ అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర విడనాడాలని, ప్రజాప్రతినిధులు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు యధావిధిగా సంక్షేమ బోర్డు ద్వారానే అమలు చేసేలా ముఖ్యమంత్రితో మాట్లాడాలని, లేకుంటే భవన నిర్మాణ కార్మికులు సత్తా చూపిస్తామని ప్రసాద్ అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుల ద్వారా సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా ఒకే విధంగా ఉండాలని ఫిబ్రవరి 29వ తేదీన దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చారని, ఈ పిలుపును కాకినాడలో జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మడగల రమణ, సప్ప సూరిబాబు, పెద్ది రెడ్ల అర్జున్, అడపా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు గ్రామాలలో ఇళ్ల పట్టాలు పంపిణీ

విశాలాంధ్ర - కరప : కరప మండలం నడకుదురు గ్రామంలో జగనన్న ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నడకుదురు గ్రామ సర్పంచ్ దేగల లలిత కుమారి ఏర్పాటు చేయగా కాకినాడ రూరల్ శాసనసభ్యులు మాజీ మంత్రి కురసాల కన్నబాబు ముఖ్య అతిథిగా పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు 704 ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. ఎంపీటీసీ పైలా గోవిందు, జవ్వాది సతీష్, వార్డు మెంబర్లు, తదితర నాయకులు పాల్గొన్నారు. గురజనాపల్లి గ్రామంలో సర్పంచ్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన జగనన్న ఇళ్ల స్థల పట్టాల పంపిణీ కార్యక్రమానికి కన్నబాబు పాల్గొని 581 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. 65లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ అర్హత కొలమానంగా సీఎం జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మరోసారి వైసీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మీ సత్తిబాబు, జడ్పిటిసి వై సుబ్బారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్నాసుల సీతారామాంజనేయులు, పబ్బినీడి పాపారావు, ఎంపీటీసీ వీరవేణి, చింత ఈశ్వరరావు, రొక్కాల గన్ రాజు, చంటి, రెడ్డిపల్లి రమేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కాకినాడ : ఆంధ్ర కొప్పుల వెలమ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ కాకినాడలోని టీడీపీ-జనసేన ఉమ్మడి కాకినాడ ఎంపీ అభ్యర్థి సానా సతీష్ బాబు క్యాంపు కార్యాల యంలో గురువారం లాంఛన ప్రాయంగా జరిగింది. సంఘం జాతీయ కన్వీనర్ రావు సంబంగితో పాటు ఇతరుల సభ్యులతో కలిసి సానా సతీష్ బాబు క్యాలెండరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్ బాబు మాట్లాడుతూ సంఘం సభ్యులకు తనవంతు సహాయసహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. వారందరూ తనకు మద్దతును తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సానా సతీష్ బాబు చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరణ జరగడం పట్ల సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర కొప్పుల వెలమ సంఘం సభ్యులు యాసలపు కన్నబాబు, పోతుల రవి, పి నాగమహేశ్వరి, గోగాడ వివిఎస్ నాయుడు, మాదపురెడ్డి నాయుడు, ఆదిరెడ్డి బాబ్జీ, అంకంరెడ్డి రామునాయుడు, సీనియర్ నాయకులు బొబ్బుల గోవింద్, బిఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీట్లు ప్రకటిస్తే పార్టీల్లో కొట్లాటే

విశాలాంధ్ర - జగ్గంపేట : జనసేన, టిడిపి పొత్తుతో సీట్లు ప్రకటించిన తరువాత వారి మధ్య కొట్లాట ఉంటుంది తప్పితే వైసిపికి నష్టం జరగదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ సమన్వయకర్త తోట నరసింహం జోస్యం చెప్పారు. జగ్గంపేట మండలం మల్లిసాలలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో నరసింహం మాట్లాడుతూ సీఎం జగన్ నా మీద నమ్మకం ఉంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారన్నారు. నన్ను గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే జగన్ మోహన్ రెడ్డి మరోసారి సీఎం అవుతారన్నారు. సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేస్తే ఇప్పుడు మీ కోసం 124 సార్లు బటన్ నొక్కారు. అప్పుడు 250 సార్లు మీకోసం బటన్ నొక్కుతారాన్నారు. టిడిపి, జనసేన పార్టీలు కలిసినా వైసిపిని ఏమి చేయలేవన్నారు. ఆ రెండు పార్టీలు ఇప్పటి వరకు సీట్లు ప్రకటించలేదని, ప్రకటిం చిన తరువాత రెండు పార్టీలు నాయకులు కొట్టుకుని అత్తారింటికి దారేది అంటారని ఆయన హేళన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జగతా ఆనందరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఒమ్మి రఘురామ్, తోట రాంజీ, అత్తులూరి సాయిబాబు, గ్రామ నాయకులు జి. సతీష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు వైసీపీ కృషి

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : గ్రామాల్లో మౌలిక వసతులకు వైసీపీ నిరంతరం కృషి చేస్తుందని, కాకినాడ ఎంపి, పిఠాపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి వంగా గీత విశ్వనాథ్ తెలిపారు. గురువారం కొత్తపల్లి మండలం ఉప్పాడ గ్రామ పంచాయతీ సూరాడ పేట గ్రామంలో మత్స్య కారులకు నిర్మించిన కోలనిలో రూ.10లక్షల రూపాయలఎంపి నిధులతో విద్యుత్ స్తంభాలు నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపి వంగా గీత మాట్లాడుతూ, శివారు గ్రామాల్లో సైతం ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వైసీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టామని అందులో త్రాగునీరు, డ్రైనులు, సీసి రోడ్లు వంటి సదుపాయాలు త్వరిత గతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాల అభివృద్ధి చూసి వచ్చే ఎన్నికల్లో వైసిపి పార్టీకి మరోసారి ప్రజలు అవకాశం ఇవ్వాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైస్ ఎంపీపీ చెట్టు బత్తుల సురేష్ కుమార్, ఉప్పాడ సర్పంచ్‌లు ఉమ్మిడి మేరీ జాన్, బంది రాణి దావీదు, కర్రీ చిన్నారావు, రాష్ట్ర వైకాపా కార్యదర్శి రావు చిన్నారావు, రాష్ట్ర వైసీపీ కార్యదర్శి వడిశెట్టి నారాయణరెడ్డి, కే శీను తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల ట్రాక్టర్ల ర్యాలీ విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కాజులూరు : రైతు సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఏపీ రైతుసంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ శుక్రవారం కాజులూరులో జరుగనున్న కౌలురైతుల ట్రాక్టర్ల ర్యాలీని విజయ వంతం చెయ్యాలని ఎపి కౌలురైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. ఈ మేరకు గురువారం రైతు సంఘాల నాయకులు మండల గ్రామాలలో పర్యటించి కరపత్రాలు, గోడ పత్రికలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా కోలంకలో రాజబాబు మాట్లాడుతూ అఖిల భారత రైతు సంఘాలు ఢిల్లీలో చేపటిన బారీ ఆందోళనలకు ప్రధాని నరేంద్రమోడీ దిగివచ్చి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని ఇది జరిగి సంవత్సరాలు కావస్తున్న ఒక్క డిమాండ్ కూడా అమలు కాలేదన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వ తీరును నిరశిస్తూ శుక్రవారం ఉదయం 10 గంటలకు కాజులూరు ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి ట్రాక్టర్ల ర్యాలీ చేపట్టనున్నామన్నారు. అనంతరం కార్యలయాల వద్ద మహాధర్నాకు అఖిల భారత రైతు సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, వివిధ వృత్తులవారు అధిక సంఖ్యంలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు నందికోళ్ళ సత్తిబాబు, వెంకన్న, బండ ప్రసాద్. యాళ్ళ సత్యనారాయణ, వాసంశెట్టి అప్పన్న, ఆనాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోవాలి

విశాలాంధ్ర - మామిడికుదురు : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే కార్మికులకు నెలకు రూ.15,000లు జీతం ఇవ్వాలని కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వర రావు అన్నారు. గురువారం మామిడికుదురు గ్రామంలోని నూకాలమ్మ గుడి వద్ద జరిగిన సమావేశంలో బొడ్డపల్లి నాగేశ్వర రావు ముఖ్య అతిథిగా హాజరై మట్లాడుతూ మధ్యాహ్నం భోజన పథకంలో పనిచేసే కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని వారికి ప్రావిడెంటు ఫండ్ ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా పథకం ఏర్పాటు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వమే నేరుగా పాఠశాలలకు గ్యాస్, కూరకాయలు, కిరాణా అందించే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మరియు డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరుకి ఈ కార్మికుల సమస్యలపై వినతి పత్రం అందజేశామన్నారు. అనంతరం మామిడికుదురు మండల కమిటీ సభ్యులుగా నీలం ధనలక్ష్మి, చెల్లుబోయిన నాగలక్ష్మి, చింతా కృష్ణవేణి, ఆకుల వెంకట లక్ష్మి, మొల్లేటి పార్వతి, సదలాడ భవాని, నీలం మంగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జనం కోసం పవన్ -పవన్ కోసం మనం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ రూరల్ నియోజకవర్గం రూరల్ మండలం వాకలపూడి గ్రామం హార్బర్పేట ప్రాంతంలో జనం కోసం పవన్ -పవన్ కోసం మనం కార్యక్రమం ద్వారా ఉమ్మడి కార్యాచరణలో భాగంగా స్థానిక జనసేన నాయకులు పాలేపు ఈశ్వర్ ఆధ్వర్యంలో ఇంటింటికి పాదయాత్ర చేస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నారు జనసేన పార్టీ పిఏసి సభ్యులు, కాకినాడ రూరల్ ఇంచార్జ్ పంతం నానాజీ, తెలుగుదేశం నాయకులు పాలేపు కృష్ణ, పాలేపు శ్రీరామ్. ఈ సందర్భంగా పర్యటన చేస్తున్న నాయకులకు గ్రామంలో త్రాగునీరు లేదని మంచినీరు డబ్బులు పెట్టి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందని, రోడ్లు లేవని, డ్రైనేజీలు లేవని, పారిశుధ్యం అసలు పట్టించు కోవడం లేదని, తెలిపారు. మత్స్య కారులకు ఇచ్చే సంక్షేమ పథకాలు, సబ్సిడీలు ఇవ్వడం లేదని, వేట విరామ సమయంలో ప్రభుత్వ భృతి అందరికి అందరికి అందడం లేదని వాపోయారు. ఫ్యాక్టరీల నుండి విడుదల అయ్యే రసాయన వ్యర్థల వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామనిన్నారు. ఇలా అనేక సమస్యలను తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గంట ప్రసాద్, శివాజీ, ధనుష్, శివ చిన్నారావు, ఒలేటి శ్రీను, స్థానిక, జనసేన యువత మరియు తెలుగుదేశం నాయకులు, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

108లో ప్రసవం

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు దుర్గాడ గ్రామానికి చెందిన మహిళ గురువారం 108లో మగబిడ్డకు జన్మనిచ్చిన సంఘటన చోటు చేసుకుంది. టెక్నీషియన్ వరప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలంలో దుర్గాడ గ్రామానికి చెందిన కొరకుప్ప అచ్యుతా చక్రమ్మకు గురువారం ఉదయం పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందజేశారు. గొల్లప్రోలు అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో పిఠాపురం 108 అంబులెన్స్‌లో చక్రమ్మను పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువస్తుంటే మార్గ మధ్యలోనే మగ బిడ్డకు జన్మనిచ్చింది తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని టెక్నీషియన్ వరప్రసాద్ తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు అంబులెన్స్ పైలెట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదానం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం కృష్ణంపాలెంలోని అనాథ వృద్ధాశ్రమంలో సామాజిక విశ్లేషకులు,కాలమిస్ట్, మోటివేషనల్ స్పీకర్ సుంకవల్లి సత్తిరాజు తన జన్మదినోత్సవ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నేటి అస్తవ్యస్థ అమానుష నాగరిక ప్రపంచంలో ఆత్మీయతలు కృత్రిమంగా తయారైపోతున్నాయని, మానవ సంబంధాలు అదృశ్యమైపోతున్నాయని, జీవిత చరమాంక దశలో వృద్ధుల అగచాట్లకు,కన్నీటి కథలకు మానవత్వం లేని సంతానమే మూలకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ ట్రస్టీ జి. శ్యామలా దేవి, అనాథలు, వృద్ధులు పాల్గొని సుంకవల్లి సత్తిరాజు సేవానిరతిని శ్లాఘిస్తూ, ఆయనకు జన్మదినోత్సవ శుభాకాంక్షలతో ఆశీస్సులందించారు.తన జన్మదినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన సేవాతత్పరులకు, పార్డ్ ఇండియా సభ్యులకు, ఉపాధ్యాయులకు, ప్రింట్ మీడియా ప్రతినిధులకు, వృద్ధాశ్రమాల నిర్వాహకులకు, మిత్రులకు సుంకవల్లి సత్తిరాజు కృతజ్ఞతలు తెలియచేసారు.

విజేతలకు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-దేవరపల్లి: మట్టిలో మాణిక్యాలను వెలికి తీసే కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర రాష్ట్రస్థాయి మహిళా క్రికెట్ పోటీలలో దేవరపల్లి సచివాలయం నుండి క్రీడల్లో పాల్గొన్న మహిళా టీంకు రాష్ట్రస్థాయిలో క్రికెట్లో ద్వితీయ స్థానం లభించింది. ఈ పోటీలలో ద్వితీయ స్థానం సాధించిన టీంకు రాష్ట్ర హెూం శాఖ మంత్రి తానేటి వనిత దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు స్వగృహంలో జరిగిన ఒక కార్యక్రమంలో మహిళా జట్టుకు ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా హెూం శాఖ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయటానికి ఆడుదాం ఆంధ్ర పోటీలు నిర్వహించిందని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న విజేతలకు ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. కెప్టెన్ కవిత, కోచ్ మునేశ్వరవులను గ్రామ కార్యదర్శి ఎన్.రవి కిషోర్లను అభినందించారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ కెవికె దుర్గారావు దేవరపల్లి మండల వైసీపీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, వైసీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు

ఉపాధి హామీ పనుల పరిశీలన

విశాలాంధ్ర - సీతానగరం: డ్వామా పిడి ఉపాధి హామీ పనులు పరిశీలించారు. మండలంలోని ముగ్గుళ్ల గ్రామంలో గురువారం డ్వామా పిడి ఎ. ముఖలింగం పంట బోదు పూడిక తీత పనులను చేస్తున్న ఉపాధి కూలీలను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ అర్ జి ఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిటెంట్లు, ఉపాధి పనుల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖలింగం మాట్లాడుతూ ఉపాధి పనులను ఎప్పటికప్పుడు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏ పి డి బి రాం ప్రసాద్, ఏ పి ఓ కె నాగ శేష వేణి, జే ఈ అంజనీ కుమార్, టి ఏ చక్రవర్తి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగావకాశాలు కల్పించిన చంద్రబాబు

విశాలాంధ్ర - అనపర్తి : రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు,మంచి జీవన స్థితిని కల్పించడంలో చంద్రబాబు నాయుడుది అందెవేసిన చేయి అనేది అందరికి తెలిసిన విషయమే అని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం రామవరంలో నల్లమిల్లి విలేకరులతో మాట్లాడుతూ మై ఫస్ట్ ఓట్ ఫర్ సి బీ ఎన్ అనే కార్యక్రమం మార్పు కోసం, నా రాష్ట్రం కోసం, నా భవిష్యత్తు కోసం,యువత కోసం అనే కార్యక్రమాన్ని ఈవేళ తెలుగుదేశం పార్టీ తీసుకోవడం జరిగిందని తెలిపారు.చంద్రబాబు నాయుడు దూరదృష్టి, కృషి వలన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐటీ పరిశ్రమలు అభివృద్ధి చెంది అత్యున్నతమైన జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాలు వచ్చే వరకు నిరుద్యోగ భృతి కింద నెలకి 3 వేలు ఇవ్వాలని ఆలోచన చేయడం జరిగిందని చెప్పారు. .ఈ సమావేశంలో మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ వారియర్స్ సూర్యకుమారి, సుభాషిణి, సత్య,అభినవ్, నాని, విజయ్, రాంబాబు, సిద్ధార్థ రెడ్డి పాల్గొన్నారు.

పాండవుల మెట్టపై రథసప్తమి వేడుకలు

విశాలాంధ్ర - పెద్దాపురం : ఈ నెల 16వ తేదీన రథ సప్తమి వేడుకులకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పెద్దాపురం సూర్యనారాయణ స్వామి స్థానిక అమరగిరి మెట్ట (పాండవుల మెట్ట) ఆలయం సిద్ధమౌతోంది. ఉభయ రాష్ట్రాల్లో అత్యంత ప్రసిద్ధిగాంచిన సూర్యనారాయణ స్వామి ఆలయం విద్యుద్దీలంకరణ, మండపాలను ఆలయ కమిటీ నిర్వాహకులు వై అనంతలక్ష్మి, గీతా వాణిల ఆధ్వర్యంలో మెట్టపై రథసప్తమి పూజలకు సూర్యనారాయణ స్వామిని సిద్ధం చేశారు. 16వ తేదీ ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమయ్యే వేడుకలు పాలు పొంగలి, కళ్యాణం, హెూమంతో పాటు సాయంత్రం 4 గంటలకు స్వామి వారికి శ్రీపుష్పయాగం నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

SANDHYA INSTITUTE OF
PHYSIOTHERAPY & REHABILITATION
A Unit of SIMS Group of Institutions, Guntur.
R.R. Road, KAKINADA-533 001, Ph: 98495 03803, 9709 84444
ADMISSION NOTIFICATION (2019-2020)

COURSE	ELIGIBILITY
MPT (Master of Physiotherapy)	B.P.T.
BPT (Bachelor of Physiotherapy)	Intermediate with Science Group

ఉంగుటూరులో పోటాపోటీ ప్రచారం

ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఉంగుటూరు నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఉంగుటూరు నియోజవర్గం నుండి పోటీ చేయడానికి పలు రాజకీయ నాయకులు పోటీకి సిద్ధమయ్యారు. అధికారికంగా

ఇప్పటివరకు ఏ పార్టీ అభ్యర్థులను ప్రకటించకపోయినా ఎవరికి వారు ఎన్నికల ప్రచారం చేసుకుంటున్నారు.అధికార పార్టీ వైసీపీ తరఫున పుప్పాల వాసు బాబు టిక్కెట్టు దాదాపు ఖరార్ అయినట్లు ప్రచారం సాగుతున్నది. పొత్తులో టిడిపికి టిక్కెట్ ఇస్తే గన్ని వీరాంజనేయులు, జనసేనకు ఇస్తే పత్స మట్ల ధర్మరాజు పోటీ చేస్తారు. బిజెపి తరఫున ఆ పార్టీ ఉంగుటూరు అసెంబ్లీ కన్వీనర్ శరణాల మాలతీ రాణి పోటీకి సిద్ధమవుతున్నారు. గత ఆరు నెలల నుండి ఉంగుటూరు నియోజక వర్గంలో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో గడపగడపకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. టిడిపి,జనసేన ఉమ్మడి పార్టీ అభ్యర్థులకు పొత్తులో ఎవరికీ టిక్కెట్ కేటాయించక పోయినా ఇరు పార్టీ అభ్యర్థులు వేర్వేరుగా నియోజకవర్గంలోఎన్నికల ప్రచారం చేసుకుంటున్నారు. బిజెపి తరఫున ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీ రాణి ఎన్నికల ప్రచారం చేసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పనులు నినాదంతో మాలతి రాణి ఎన్నికల ప్రచారం చేసుకుంటున్నారు. ఇప్పటివరకు ఎమ్మెల్యే అభ్యర్థులను ఏ పార్టీ ప్రకటించలేదు. చివరికి టిక్కెట్లు ఎవరికి వస్తాయో వేచి చూద్దాం.

సమస్యల పరిష్కారానికి ఉద్యోగుల నిరసనలు

విశాలాంధ్ర - ముదినేపల్లి : సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ ఎన్జీవోస్ మండవల్లి యూనిట్ అధ్యక్షులు ఎం.వి సుబ్బారావు డిమాండ్ చేశారు. ఏపీ ఎన్జీవోస్ ఈస్ట్ కృష్ణ అధ్యక్షులు ఉల్లి కృష్ణ పిలుపుమేరకు ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్ల రిబ్బన్లను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమకు రావలసిన రెండు డి ఏ లు , మధ్యంతర భృతి 30 శాతం, పిఎఫ్ బకాయిలు విడుదల చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది ఏవో రమణబాబు , సీనియర్ అసిస్టెంట్ ఎం నాగేశ్వరరావు, డి. దాని, ఎంఈఓ కార్యాలయం , ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దు కోరుతూ యుటిఎఫ్ క్యాంపెయిన్

విశాలాంధ్ర- ఉంగుటూరు: సిపిఎస్ రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని వివిధ రాజకీయ పార్టీలను కోరుతూ విరామ సమయంలో యూటీఎఫ్ ఉంగుటూరు మండల శాఖ పక్షాన పోస్ట్ కార్డు క్యాంపెయిన్ గురువారం జరిగింది. మండల యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వునుముల రాంబాబు. దాకి జోగినాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడుకి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కి,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ షర్మిలరెడ్డి కివారి వారి పార్టీ మేనిఫెస్టోలో ఓపిఎస్‌ను ప్రవేశపెడతామని వారి వారి మేనిఫెస్టోలో పేర్కొనాలని పోస్ట్ కార్డు రాయడం ద్వారా విజ్ఞప్తులు చేశామని యుటిఎఫ్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు శీతాల సత్యనారాయణ, కార్యదర్శి సిహెచ్ శ్రీధర్, ఉపాధ్యక్షులు హరికృష్ణ,కోశాధికారి ఊట. ఆనందకుమార్,జిల్లా కౌన్సిలర్స్ పుప్పాల నరసింహారావు, బొమ్మిడి ప్రసాద్ తీడ. శ్రీధర్.కె ప్రేమ్ కుమార్, గొల్లగూడెం హైస్కూల్ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వివాహ రిసెప్షన్ వేడుకలలో జనసేన ధర్మరాజు

విశాలాంధ్ర - నిడమర్రు: నిడమర్రు మండలం గుణపర్రు గ్రామానికి చెందిన కాకులపాటి కిషోర్ వివాహ రిసెప్షన్ వేడుకకు ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు గురువారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతోపాటు ఈ వేడుకలో నిడమర్రు మండలం జనసేన పార్టీ అధ్యక్షులు నిమ్మల దొరబాబు, జనసేన నాయకులు పట్టపు హేమంత్, వంగ రఘు, గోలి సాయి పుండారీకాక్షుడు, బేతు మురళి, సూరత్తుల అయ్యప్ప, తాడిశెట్టి శివ, గౌతు వెంకన్న, ముదునూరి ప్రసాద్, గ్రామ జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

కవిటంలో వైభవంగా శ్రీ కాళహస్తీశ్వర స్వామి కళ్యాణోత్సవం



విశాలాంధ్ర-పోడూరు : కవిటం గ్రామంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న శ్రీ అతిరుద్ర మహాయాగ మహోత్సవాలలో భాగంగా 5వ రోజయిన గురువారం వేదపండితులు రుద్ర హోమం, చండీ హోమం, అభిషేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పెనుమంట్ర మండలం నెలమూరు కు చెందిన శ్రీ ఉమా రామలింగేశ్వర ట్రస్ట్, శర్వాణి స్కూల్ ఆధ్వర్యంలో దాతలు, భక్తులు, గ్రామస్తుల సహకారంతో ఈ యాగ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. వైయస్సార్సీపి నరసాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల యాగ మహోత్సవం లో పాల్గొన్నారు. యాగమహోత్సవం లో భాగంగా శ్రీ జ్ఞాన ప్రసునాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి దివ్య కళ్యాణోత్సవం వైభవంగా జరిపారు. ఆధ్యాత్మికవేత్త జంధ్యాల శ్రీనివాస శర్మ(నెలమూరు శర్మ), కవిటం సొసైటీ చైర్మన్ కర్రి శ్రీనివాసరెడ్డి, గుడిమెట్ల రామ కనకారెడ్డి, సత్తి మురళీకృష్ణ రెడ్డి , సత్తి రామచంద్రారెడ్డి, గాదే శ్రీనివాసరావు, పడాల వెంకట సత్యనారాయణ రెడ్డి, కర్రి రామిరెడ్డి కర్రి గంగాధర రెడ్డి, బాలాజీ రెడ్డి, వైస్ ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మాదకద్రవ్యాలకు బలికావొద్దు

విశాలాంధ్ర -భీమవరం: యువత దేశానికి వెన్నెముక అని, దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ఆప్కా సిద్దీఖ్ అన్నారు. జమాతే ఇస్లామి హింద్ సంస్థ ఆధ్వర్యంలో సి.ఎస్.ఎన్. జూనియర్ కళాశాలలో "మత్తు రహిత సమాజ స్థాపన" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో యువత ధూమపానం, మద్యం, మాదకద్రవ్యాలకు బానిసలై తమ బంగారు జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి కుటుంబంలో ఒక్కరైనా ఈ దుర్వసనానికి బానిసగా మారి మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పాడు చేసుకోవడమే కాకుండా, కుటుంబ వ్యవస్థను సైతం తూట్లు పొడిచి, కుటుంబాలు ఆర్థికంగా దివాళా తీసి రోడ్డున పడే విధంగా కారకులుగా నిలుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.యువత, విద్యార్థులు చాలా అప్రమత్తంగా చెడ్డవారితో, పరిచయంలేని క్రొత్త వారితో పరిచయాలు పెట్టుకోవద్దని, తల్లిదండ్రులు తప్ప ఇంకెవ్వరిని అతిగా నమ్మవద్దని ఆయన సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ ఎం.డి. సలీం ఖాన్, జమాతే ఇస్లామి హింద్ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ ఫర్హాన్, ఎస్.ఐ.ఓ. పట్టణ అధ్యక్షుడు ముహమ్మద్ అమీన్, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి సాయం అందజేత

విశాలాంధ్ర - లింగపాలెం : కిడ్నీల వ్యాధితో అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీసీహెచ్ఆర్ పాలెంకు చెందిన పింగుల కుటుంబరావుకు స్నేహితులు, స్థానికులు కలిసి ఆర్థిక సాయం చేసి చికిత్స చేయిస్తున్నారు. బాధితునికి రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. డిగ్రీ వరకు చదివి నిరుద్యోగిగా ఉంటూ కూలి పనులకు వెళ్తూ భార్య, రెండేళ్ళ కూతురిని పోషిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎటువంటి చెడు అలవాట్లు లేని బాధితుడు దురదృష్టవశాత్తు కిడ్నీల వ్యాధి బారినపడ్డాడు. వైద్యం కోసం స్నేహితులు, సహచరులైన పాదిల రమేస్, లక్కపాం రమేష్, పింగుల ప్రణయ్, భీమడోలు రాజేష్, పాదిల చిరంజీవి తదితరులు కలిసి రూ. 70 వేలు సేకరించి విరాళంగా బాధితుని వైద్యం కోసం అందించారు. మైత్రీ డవలపర్స్ వ్యవస్థాపకులు భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి బాధితునికి రూ. 25 వేలు, తెలుగుదేశం పార్టీ నాయకులు సొంగా రోషన్‌కుమార్ రూ. 20 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ పరామర్శించి కొంత ఆర్థిక సాయం అందించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తానని ఈయన బాధిత కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. కిడ్నీల వ్యాధితో బాధపడుతున్న బాధితుడు త్వరగా కోలుకోవాలని ప్రతీ ఒక్కరు కోరుకుంటున్నారు.

ఎస్ఆర్‌కెఆర్‌కు ఎన్‌బిఏ గుర్తింపు

విశాలాంధ్ర -భీమవరం: ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయస్థాయిలో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్(ఎన్ బి ఏ) మూడు సంవత్సరాలకు గాను గుర్తింపు లభించిందని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఒకేసారి ఆరు బ్రాంచీలకు ఎన్ బి ఏ గుర్తింపు రావడం తమ కళాశాలకు అరుదైన

రికార్డుగా పేర్కొన్నారు. గత డిసెంబర్ నెలలలో ఎన్ బీ ఏ బృందం కళాశాలలో పర్యటించిందన్నారు. కళాశాలలోని అన్ని అంశాలు పరిగణలోకి తీసుకొని మూడు సంవత్సరాల కాల పరిమితికి గాను తమకు అరుదైన గుర్తింపు లభించింది అని పేర్కొన్నారు. ఎన్ బీ ఏ ఈ మేరకు కళాశాలకు గురువారం ఆదేశాలు జారీ చేసింది అన్నారు. కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపల్ వివిధ విభాగాల హెడ్స్ ,డీన్స్ అందరూ కలిపి మీడియాతో తమ ఆనందాన్ని పంచుకున్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కే.వీ.మురళీకృష్ణమరాజులు మాట్లాడుతూ 43 సంవత్సరాల చరిత్ర కలిగిన తమ కళాశాల జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వేలాది ఇంజనీర్లను తీర్చిదిద్దటమే కాకుండా కేంద్ర ప్రభుత్వ పరిశోధనా సంస్థల నుండి కూడా ఎన్నో ప్రాజెక్టులు చేపట్టి సమాజానికి ఉపయోగపడే ప్రయోగాలు కూడా చేయటం తమ కళాశాలకు ఈ అరుదైన ఖ్యాతి లభించింది అన్నారు. కళాశాలలోని సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బ్రాంచీలకు ఎన్‌బిఏ గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ ఆర్ కె నిశాంత్ వర్మ కళాశాల డైరెక్టర్ జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణంరాజు, వివిధ విభాగాల హెడ్స్ ,డీన్స్ ను కూడా ప్రత్యేకంగా అభినందించారు.

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

విశాలాంధ్ర - ముదినేపల్లి : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిన ఘనత వైసీపీకే చెందుతుందని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు.మండలంలోని వడాలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. ప్రభుదాస్, విద్యా కమిటీ చైర్పర్సన్ పల్లి ఉమామహేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో నాడు నేడు పథకం ద్వారా పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం , అమ్మ ఒడి , విద్యా కానుక , విద్యా దీవెన లాంటి ప్రతిష్టాత్మక పథకాలతో విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులంతా సక్రమంగా సద్వినియోగం చేసుకోవా లన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు, నాటికలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మరీదు దుర్గశ్రీహనుమంతు, జడ్పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ పల్లి శ్రీదేవి శ్రీధర్, మద్రివాడ వీరారెడ్డి, బత్తిన కిషోర్, ఉపాధ్యాయులు సిహెచ్ నాగమల్లేశ్వరరావు, బిఎస్ ప్రకాష్, ఎన్. వాసవి, పి రంగబాబు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్రైవర్‌కు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : ప్రమాదానికి గురై ఆపదలో ఉన్న తోటి డ్రైవర్ కు టాటా మ్యాజిక్ యూనియన్స్ డ్రైవర్లు అంతా కలిసి అరవై వేల పదకొండు వందల రూపాయలను అందజేసి నట్టు కొయ్యలగూడెం టాటా మ్యాజిక్ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షులు వెలగల ధనరాజు, ధూళిపాల సత్యనారాయణ తెలిపారు. గాజువాకకు చెందిన టాటా మ్యాజిక్ డ్రైవర్

దామోదరంకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో అతనికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆల్ ఆంధ్ర టాటా మ్యాజిక్ యూనియన్ల డ్రైవర్ సోదరులందరూ కలిసి దామోదర్ కుటుంబ సభ్యులకు 60 వేల పదకొండు రూపాయలు అందజేసినట్టు పేర్కొన్నారు. డ్రైవర్ సోదరులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ధనరాజు పేర్కొన్నారు.

వలస పక్షులైతేనే విజయం సాధిస్తాయా?

బీసీలంటే బలిపశువులా...టీడీపీ పయనమెటు ?

విశాలాంధ్ర -చాట్రాయి: 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో 40ఏళ్ళచరిత్ర కలిగిన తెలుగు దేశం పార్టీలో నూజివీడు నియోజకవర్గంలో బలహీనవర్గాల సామాజిక తరగతుల ప్రజానీకంలో ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అర్హత కలిగిన ఒక్క మనిషి కూడా లేరా...? వలస పక్షులు అయితేనే విజయం సాధిస్తాయా అనేది చర్చనీయాంశంగా మారింది. తెలుగుదేశం పార్టీ అధిష్టానం నూజివీడు శాసనసభ స్థానం అభ్యర్థి నిర్ణయం పై వ్యవహరిస్తున్న తీరు అనేక ప్రశ్నలను లేవనెత్తింది.

వైకాపా పెనమలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి తెలుగు దేశం పార్టీ నూజివీడు నియోజకవర్గ అభ్యర్థిగా తనను నియమించారని ఆగిరిపల్లి మండలంలోని అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి పలు గ్రామాల్లో పర్యటిస్తూ పరిచయ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ తనను చంద్రబాబు నూజివీడు వెళ్ళమంటేనే వచ్చానని ఇంకా అనేక విషయాలు పరిచయ కార్యక్రమాల్లో చెప్పడం ప్రారంభించారు. దీనిపై కోపోద్రిక్తులైన ఆగిరిపల్లి మండలంలోని ప్రముఖ తెలుగుదేశం పార్టీ నాయకులు అంతా తీవ్రంగా ఖండిస్తూ సోషల్ మీడియాలో వీడియోలను ట్రోల్ చేయడంతో మరోసారి టిడిపి విభేదాలు భగ్గుమన్నాయి. తెలుగుదేశం పార్టీలో ఇప్పటివరకు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు ఆయన వ్యతిరేకులకు మధ్య ముఠాలు నడవగా తెలుగుదేశం పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయంతో ఆ వర్గాలు,యాదవ సామాజిక తరగతి నేతల మధ్యలో పెద్ద వివాదంగా మారింది. నియోజకవర్గంలో అత్యధిక మంది యాదవులకు నిలయమైన ఆగిరిపల్లి మండలంలోని తెలుగుదేశం పార్టీ యాదవ సామాజిక తరగతికి చెందిన అగ్ర స్థాయి నాయకత్వం ముక్తకంఠంతో ముద్దరబోయిన పై కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. నిర్మాణాత్మకంగా పటిష్టమైన తెలుగుదేశం పార్టీ విలువలకు తిలోదకాలు ఇస్తుందని ధ్వజమెత్తారు. నియోజక వర్గం మొత్తం చర్చనీయాంశంగా మారింది. ఆరు నెలలకు ఒకళ్ళు మూడు నెలలకు ఒకళ్ళు వచ్చి ... మమ్మల్ని చూసుకోమన్నారు బాబు వెళ్ళమన్నారు అంటూ పరిచయ కార్యక్రమాలు తిరగడం పరిచయకార్యక్రమాలు పరిపాటిగా మారిపోయిందని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. ఓసి సామాజిక తరగతి కి చెందిన నూజివీడు ఏఎంసి మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు ఒక జీవనదిలా పార్టీలో పదవులు ఉన్నా లేకపోయినా ఆర్థికంగా పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తూ పార్టీ కోసం పనిచేసినా పార్టీలో కనీసమైన పదవిలేని పరిస్థితి. పంచాయతీ సర్పంచ్ గా రావిచర్ల గ్రామస్తులు ఇచ్చిన పదవి, సుమారు ఒక సంవత్సరంన్నర క్రితం ముసునూరు మండలం గోగులంపాడు గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త పర్వతనేని గంగాధర్ టిడిపిలో ఎమ్మెల్యేగా పోటీ చేయడం కోసం ఉత్సాహంతో సుమారు రూ. 8 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఆయన కూడా అధిష్టానం వెళ్ళమంటే వచ్చానని అప్పట్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అట్లూరి రమేష్ గత కొన్ని సంవత్సరాల నుండి సందర్భానుసారం తెలుగుదేశం పార్టీ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతూనే ఉన్నారు. ఇటీవల చంద్రబాబు సభకు సైతం పర్వతనేని గంగాధర్ పెద్ద ఎత్తున ఖర్చు పెట్టి అన్నదానాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 2లక్షల ముప్పై వేల మంది పైగా ఓటర్లు ఉండగా ఎస్సీ, ఎస్టీ,బి సి సామాజిక తరగతులకు చెందిన వారు లక్ష యాభై వేల మంది పైగా ఉన్నట్లు తెలుస్తోంది.40 ఏళ్ల తెలుగుదేశం పార్టీలో ఇక్కడ పుట్టి పెరిగిన వారిని ఒక్కరిని కూడా ఎమ్మెల్యే స్థాయికి అభివృద్ధి చేయలేదని అధిష్టాన నిర్ణయమే అద్దం పడుతుందని పలువురు అంటున్నారు.

ముదురుతున్న పోతుకుర్రు వివాదం

మూడవరోజు కొనసాగిన రిలే దీక్షలు

విశాలాంధ్ర - అమలాపురం : అయినవిల్లి మండలం పోతుకుర్రు జగనన్న లే అవుట్ మేరక చేసిన విషయంలో పనిచేసిన కూలీలు

సొమ్ము సుమారు ఏడున్నర లక్షలు కాజేసాడని అదే గ్రామానికి చెందిన కూలీలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి మూడవ రోజుకు చేరుకున్నాయి. ఈ ఘటనపై అమలాపురం ఆర్‌డిఓ ఆదేశాల మేరకు అయినవిల్లి ఎంపిడిఓ తన సిబ్బంది ఏపిఓ నాగబాబు, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్‌లు గ్రామంలో విచారణ నిర్వహించారు. తమ నివేదిక ఆర్‌డిఓకి అందజేస్తామని చెప్పారు. "గురువారం విశాలాంధ్రలో కూలీల కష్టాన్ని కాంట్రాక్టర్ బొక్కేసారు "శీర్షిక ప్రచురితమైన వార్త అధికారులు, రాజకీయ పార్టీల్లో కదలిక తీసుకువచ్చింది. జగనన్న లేఔట్‌లో కూలీల రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని టిడిపి నాయకులు, జనసేన ఎంపీటీసీ గుర్రాల రాంబాబు, పోతుకుర్రు మాజీ సర్పంచ్ గుమ్మడి సాగర్, మాజీ ఎంపీటీసీ మెల్లమ్ సత్యనారాయణ, మాల మహానాడు నాయకుడు కొంకి వెంకటరావు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టిడిపి అధికార ప్రతినిధి ఎస్‌విఎస్ఎన్ వర్మ తెలిపారు. గురువారం కొమరగిరి పంచాయతీ పరిధిలో ఉన్న ఆనంద నగర్, నాగంపేట, చిన్న కలవల దొడ్డి, వెంకట్రాయపురంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో వర్మ పాల్గొని గడపగడపకు తిరుగుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు అమలవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు కరపత్రాలు అందించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ వైయస్సార్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు నష్టపోయారని, యువతకు ఉద్యోగ అవకాశాలు లేకుండా చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలి బట్టలను నొక్కుతున్నానని వారి కార్యకర్తలకే బట్టలను నొక్కుతూ మోసం చేస్తున్నట్లు తెలిపారు. అన్ని విధాలుగా రాష్ట్రం అభివృద్ధి టిడిపి, జనసేన ప్రభుత్వం రావాల్సిందేనని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అనిశెట్టి సత్యానంద రెడ్డి, కటారి రాజబాబు, వెంకట పరమేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి బత్తుల చైతన్య రాజేష్ కుమార్, రాయుడు శ్రీరాములు, వెంకటేశ్వరరావు, దొరబాబు, ఆనాల బాలమురళీకృష్ణ, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో మెరుగైన ఆలోచన ఉండాలి

విశాలాంధ్ర - కాజులూరు : విద్యార్థుల్లో మెరుగైన ఆలోచన ఉంటే విద్యార్థుల జీవితం కూడా రోజురోజుకు మెరుగుపడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని మోహన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మోహన్ పేర్కొన్నారు. గురువారం తమ విద్యా సంస్థల్లో 8వ తరగతి చదువుతున్న సలాది ప్రజ్వాలు గత సంవత్సరంలో కాకినాడ జిల్లా కాకినాడ స్థానిక సాలిపేట నగరపాలక ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఇన్స్పైర్ మానక్ 2023 సైన్స్ ప్రదర్శన నిర్వహించగా, ఆ ప్రదర్శనలో తమ సంస్థ నుంచి సలాది ప్రజ్వాలు నీటి పారుదల కొరకు పురుగుమందులతో ఆటోమేటిక్ నీటి ప్రవాహం అనే ప్రాజెక్టుపై ప్రదర్శన ఇవ్వగా ఆ ప్రదర్శన గురువారం రాష్ట్రస్థాయికి ఎంపిక అయిందని తెలియడంతో కరస్పాండెంట్ మోహన్ విద్యార్థి సలాది ప్రజ్వాలను, ఉపాధ్యాయురాలు కవితను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ సంస్థ విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి కూడా చదువుతో ఉన్నత శిఖరాలను అధిరోహించడం కోసం దేశానికి ఉపయోగపడే విధంగా తమ ఆలోచన భావాలను మార్చుకుంటూ వివిధ రంగాల్లో ప్రయత్నం చేస్తూ ఉండాలన్నారు. అనంతరం ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రజ్వలన అభినందించారు.

విద్యతోనే లక్ష్యాల సాధన

విశాలాంధ్ర - కలిదిండి: విద్యార్థులు విద్యతోనే అనుకున్న లక్ష్యాలను సాధించి మంచి భవిష్యత్తును పొందగలరని మాజీ ఉపముఖ్య మంత్రి ఆళ్ల నాని విద్యార్థులకు సూచించారు. గురువారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయ మంగళ. వెంకటరమణతో కలిసి రిబ్బన్ కట్ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం రూ.8 కోట్లతో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులు ఉన్నతంగా చదువుకొని తమ కలలను సాకారం చేసుకోవచ్చన్నారు. అన్ని వసతులతో విద్యార్థులకు సౌకర్యవంతంగా నిర్మించిన పాలిటెక్నిక్ కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బొర్రా సత్యవతి, ఎంపీటీసీలు చందన ఉమామహేశ్వరరావు, రామిశెట్టి సత్యనారాయణ ఉపాధ్యాయులు ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి పీఠంలో రథసప్తమి వేడుకలు

విశాలాంధ్ర - పెద్దాపురం : స్థానిక వర్జుల వారి వీధిలో వున్న భువనేశ్వరి పీఠంలో రథ సప్తమి వేడుకలు ఈనెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు లలితా వాస్తు జ్యోతిష్యాలయ నిర్వాహకులు చింతా గోపిశర్మ సిద్ధాంతి తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రథ సప్తమి వేడుకల్లో భాగంగా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సూర్య నమస్కార సహిత మహా సౌరహోమం నిర్వహించడం జరుగుతుందన్నారు. సుమారు 12 మంది రుత్వికలచే సూర్య నమస్కారాలు నిర్వహించి ప్రసాద వితరణ జరుగుతుందని, పూజల్లో పాల్గొనే భక్తులు ముందుగా 9866193557 నెంబరుకు తెలియజేయాలని గోపిశర్మ సిద్ధాంతి కోరారు.

సహస్రలో వసంత పంచమి వేడుకలు

విశాలాంధ్ర - అమలాపురం : సహస్ర ఇంటర్నేషనల్ స్కూల్ నందు వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. దీనిలోని భాగంగా సహస్ర విద్యార్థినీ విద్యార్థులు సరస్వతి

దేవిని భక్తిశ్రద్ధలతో పూజించారు. క్రొత్తగా పాఠశాలలో చేరినటువంటి విద్యార్థిని, విద్యార్థులు, వారి యొక్క తల్లిదండ్రులు అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొనేరి.దీనిలో భాగంగా స్కూల్ డైరెక్టర్ ఆర్ వేణుగోపాలరావు. సహస్ర ప్రిన్సిపల్ గౌసియా బేగం, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్ల పంపిణీ

విశాలాంధ్ర - పాలకొల్లు : పెనుమదం జిల్లా పరిషత్ హై హైస్కూల్లో కేరింగ్ అండ్ షేరింగ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎగ్జామ్ పాడ్స్, పెన్స్, స్టేషనరీని అందజేసే కార్యక్రమం గురువారం జరిగింది. మొత్తం 63 మంది పదవ తరగతి విద్యార్థులకు ఈ విద్యా సామగ్రిని అందజేశారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేరింగ్ అండ్ షేరింగ్ వెల్ఫేర్ సొసైటీ అందించే సహాయాన్ని సద్వి చేసుకోవాలని కోరారు. చక్కగా చదువుకుని విద్యార్థులు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సర్పంచ్ తానేటి బాబురావు, మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ పితాని సత్యనారాయణ (చిన్న), కేరింగ్ అండ్ షేరింగ్ వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ కడలి విజయ్ కుమార్ రాజు, ట్రెజరర్ కడలి మీరా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్

విశాలాంధ్ర-భీమవరం: ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమం నేడు శుక్రవారం కలెక్టరేట్లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.భీమవరం కలెక్టరేట్ లో స్పందన సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం గం 10:30లకు ఉద్యోగుల గ్రీవెన్స్ ప్రారంభమవుతుందన్నారు. ఉద్యోగులు ఎవరైనా తమ సమస్యలు చెప్పుకోవచ్చన్నారు. గ్రీవెన్స్ సెల్‌కు వెళ్లదలచిన ఉద్యోగులకు అధికారులు అనుమతులు ఇవ్వాలన్నారు. జిల్లా అధికారులంతా అందుబాటులో ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆ ప్రకటనలో కోరారు.